సాక్షి ప్రకాశం

సోమవారం | 25 | సెప్టెంబర్ | 2023



రూ.9 లక్షల విలువైన గోవా మద్యం స్వాధీనం

రూ.9 లక్షల విలువైన 1.089 బాటిళ్ల గోవా మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

- 8లో..



విద్యుదాఘాతంతో యువకుడు మృతి

విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన కొమరోలు మండలం గుడ్రెడ్డిపల్లెలో ఆదివారం సాయంత్రం జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
36/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రెజ్లింగ్ పోటీల విజేతలకు అభినందన



రెజ్లింగ్ విజేతలను అభినందిస్తున్న ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ

ఒంగోలు: ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్‌టీఆర్ జిల్లాలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన రెజ్లింగ్ క్రీడాకారులు సత్తాచాటారు. అండర్ 14 విభాగంలో బాలురు ఒక రజిత, రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అండర్ 17 బాలుర ఫ్రీ స్టైల్, గ్రీకో రోమన్ విభాగంలో రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులు, జిల్లా జట్టు మేనేజర్, ఫిజికల్ డైరెక్టర్ షకీల, శిక్షకులు రవికుమార్‌లను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ అభినందించారు.

వీఆర్‌ఓ సంఘం జిల్లా అధ్యక్షుడిగా రంగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వీఆర్‌ఓ సంఘ మాజీ జిల్లా అధ్యక్షుడు రాము

ఒంగోలు అర్బన్: వీఆర్‌ఓ సంఘ జిల్లా అధ్యక్షుడుగా ఇప్పటి వరకు ప్రధాన కార్యదర్శిగా ఉన్న వైపీ రంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఉన్న రాము పదోన్నతిపై వెళ్లడంతో కార్యవర్గంలో ఖాళీగా ఉన్న పోస్టులను కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏసీహెచ్ ఆదిరెడ్డి, ప్రచార కార్యదర్శి కే జగదీష్, జాయింట్ సెక్రటరీ జి.బాదుర్ల, ఈసీ సభ్యులు జీ వినీల, కనిగిరి డివిజన్ అధ్యక్షుడుగా ఎం.రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. దీనిలో మాజీ అధ్యక్షుడు పీ రాము, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కందిమళ్ల వీరాంజనేయులు, జిల్లా, డివిజన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



వినాయకుడి విగ్రహాల నిమజ్జనానికి వచ్చిన జనంతో రద్దీగా ఉన్న కొత్తపట్నం సముద్రతీరం



వినాయక ప్రతిమకు హారతి ఇస్తున్న మహిళ



వినాయక నిమజ్జన ఊరేగింపులో భక్తుల కోలాటం



కొత్తపట్నం తీరంలో బారులుతీరిన వినాయక విగ్రహాలు



కొత్తపట్నం సముద్రతీరంలో భక్తుల కేరింతలు

బైబై గణేశా..

గంగ ఒడికి గౌరీ పుత్రుడు



వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో వారం రోజులుగా భక్తుల పూజలందుకున్న గణనాథుడి ప్రతిమలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. దీంతో జిల్లాలోని తీరప్రాంత గ్రామాలైన కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల తీరాలకు భారీగా వినాయక ప్రతిమలను సముద్రంలో నిమజ్జనం చేసేందుకు తరలించారు. మేళతాళాలతో, రంగులు చల్లుకుంటూ, బాణసంచా సందడితో కోలాహలంగా విగ్రహాలను తీసుకెళ్లారు. సెలవుదినం కావడంతో వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కొత్తపట్నం, పాకల సముద్ర తీరాలు సందడిగా మారాయి. ఆదివారం ఒక్కరోజు ఈతముక్కల, మడనూరు, కొత్తపట్నం తీరాల్లో 323 విగ్రహాలను, పాకలలో 176 విగ్రహాలను నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పాకల తీరంలో నిమజ్జనం చేస్తున్న వినాయక విగ్రహాలు



పాకల బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి



కొత్తపట్నం సముద్ర తీరంలో వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



పాకల బీచ్‌కు వినాయక విగ్రహాలను తరలిస్తున్న భక్తులు



పాకల బీచ్‌కు భారీగా తరలివచ్చిన ప్రజలు

వందే భారత్ రైళ్లతో నూతన శకం

- రైలుకు ఘన స్వాగతం పలికిన కలెక్టర్, రైల్వే అధికారులు
- రైలులో అధునాతన సౌకర్యాలున్నాయన్న కలెక్టర్
- తన కుమారుడు, కుమార్తెతో కలిసి సింగరాయకొండ వరకు ప్రయాణించిన కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు సబర్బన్: వందే భారత్ రైళ్ల ప్రవేశంతో రైలు ప్రయాణంలో నూతన శకం ఆరంభమైందని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ అన్నారు. ఈ మేరకు విజయవాడ నుంచి చెన్నైకి ప్రవేశపెట్టిన నూతన వందే భారత్ రైలు మొదటి ప్రయాణంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఒంగోలు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్, రైల్వే అధికారులు, పలువురు ప్రముఖులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వందే భారత్ రైలుకు ఒంగోలులో ఘన స్వాగతం పలికారు. నగరంలోని ప్రజలు, ప్రయాణికులు వందే భారత్ రైలును చూడటానికి ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ వందే భారత్ రైలు చెన్నై వెళ్లటానికి ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ రైలు వల్ల ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని వెల్లడించారు. ఒంగోలు ప్రాంత వాసులతో పాటు జిల్లాలోని ప్రజలకు కూడా ఈ రైలు ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. వందే భారత్ రైలు చెన్నై, తిరుపతి వెళ్లేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఇంత సౌకర్యవంతమైన రైలును ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కలెక్టర్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ రైలును అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఇంజినీర్లను కూడా కలెక్టర్ అభినందించారు. ఒంగోలు రైల్వే స్టేషన్‌లో రూ.26 కోట్ల అంచనా వ్యయంతో ఆధునీకీకరణ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తన కుమారుడు, కుమార్తెతో కలిసి వందే భారత్ రైలులో సింగరాయకొండ వరకు ప్రయాణించారు. రైలులోని ప్రయాణికులతో ముచ్చటించారు. వందే భారత్ రైలు ప్రత్యేకతల గురించి అడిగి తెలుసుకున్నారు. రైలులో ప్రయాణికులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ రైలులో ప్రయాణించటం గొప్ప అనుభూతి అని కలెక్టర్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులతో పాటు పలువురు బీజేపీ నాయకులు కూడా పాల్గొన్నారు. చెన్నై నుంచి విజయవాడ వైపునకు వెళ్లే వందేభారత్ రైలు ఉదయం గం.10.09కు ఒంగోలుకు వస్తుంది. అదేవిధంగా విజయవాడ నుంచి చెన్నై వైపునకు వెళ్లే రైలు సాయంత్రం గం.5.03కు ఒంగోలు చేరుకుంటుంది.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు జనం జేజేలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగిన విజయవాడ–చెన్నై వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు జనం జేజేలు పలికారు. వందేభారత్ రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో 5 నిమిషాలు ఆగింది. కలెక్టర్ ఆర్ఎస్ దినేష్‌కుమార్ తన పిల్లలతో కలిసి ఒంగోలు నుంచి సింగరాయకొండ వరకు రైలులో ప్రయాణించి స్థానిక స్టేషన్‌లో దిగి రోడ్డు మార్గంలో ఒంగోలు వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వందేభారత్ రైలులో పిల్లలతో సహా ప్రయాణించడం ప్రత్యేక అనుభూతి చెందానన్నారు. స్థానిక ప్రజలు ఈ రైలు ప్రతిరోజు ఆపాలని డిమాండ్ చేశారు. కందుకూరు ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజి కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, వివిధ పార్టీల నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.



వందేభారత్ రైలుకు జెండా ఊపుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో పిల్లలతో కలెక్టర్

అభివృద్ధి లక్ష్యం..సంక్షేమ మార్గం

- నేటితో మూడో వసంతంలోకి జిల్లా పరిషత్ పాలకవర్గం
- రెండేళ్లలో సీపీడబ్ల్యూఎస్ స్కీముల నిర్వహణకు రూ.57 కోట్లు మంజూరు
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.50 కోట్లు కేటాయింపు
- దర్శి నియోజకవర్గంలో రూ.10 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు
- విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు రూ.10 లక్షలతో స్టడీ మెటీరియల్
- బాలికల సంక్షేమ హాస్టళ్లకు జెడ్పీ నిధులతో ఇన్వర్టర్ల ఏర్పాటు

ఒంగోలు: జిల్లా పరిషత్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టి సోమవారానికి రెండేళ్లు పూర్తి చేసుకుంది. 2021 సెప్టెంబర్ 25న జెడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకారంతోపాటు జెడ్పీ చైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి జిల్లా పరిషత్ పరంగా జిల్లా అభివృద్ధికి పెద్ద పీటవేశారు. ఒక వైపు అభివృద్ధి, రెండో వైపు సంక్షేమం, ఇంకో వైపు మానవీయ కోణాలను స్పృశిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటూ ముందుకు సాగుతున్న పాలకవర్గంపై జిల్లా ప్రజానీకం మరిన్ని ఆశలు పెంచుకున్నారు. గత రెండేళ్లలో జెడ్పీ పరంగా చేపట్టిన పలు కార్యక్రమాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. క్రమం తప్పకుండా పాలకవర్గ సమావేశాలు నిర్వహించడం, జిల్లా విభజన జరిగినప్పటికీ ఉమ్మడి ప్రకాశం జిల్లా వేదికగా జెడ్పీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించడం, ఎంపీపీ, జెడ్పీటీసీల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలకు పరిష్కారం చూపడంలో ప్రశంసలు అందుకుంది. మరో వైపు జెడ్పీటీసీ సభ్యులకు మండల కేంద్రాల్లో గౌరవం పెంపునకు ఒక గది తప్పనిసరి అని భావించి నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేసి జెడ్పీటీసీ సభ్యుల నుంచి అభినందనలు అందుకున్నారు. ప్రకాశం జిల్లా చరిత్రలోనే ప్రస్తుత జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు అందరూ కూడా వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొందిన వారే కావడం గమనార్హం.



సీపీడబ్ల్యూఎస్ స్కీమును పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ (ఫైల్)



విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి (ఫైల్)

సీపీడబ్ల్యూ స్కీములకు రూ.57 కోట్లు మంజూరు:

జిల్లాలో సమీకృత రక్షిత మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్)కు రూ.57 కోట్లు కేటాయించారు. 2022–23 సంవత్సరంలో జిల్లాలోని 55 సీపీడబ్ల్యూఎస్ స్కీముల నిర్వహణకు రూ.27.64 కోట్లు మంజూరు చేశారు. ఇక 2023–24 ఏడాదికి గాను రూ.29.36 కోట్లు మంజూరు చేశారు. రెండేళ్లలో ఈ పథకం నిర్వహణకు జెడ్పీ పాలకవర్గం రూ.57 కోట్లు మంజూరు చేసినట్లయింది.

జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.50 కోట్లు మంజూరు:

జిల్లాలో అపరిష్కృతంగా, అసంపూర్ణంగా ఉన్న పలు అభివృద్ధి పనులకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి రూ.50 కోట్లు కేటాయించారు. పనులు పూర్తయిన వాటికి ఇందులో ఇప్పటికే రూ.20 కోట్లకుపైగా చెల్లింపులు కూడా చేశారు. గ్రామ సచివాలయాలు నిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు, విలేజి హెల్త్ క్లినిక్స్, సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, తాగునీటి పంపిణీ, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, క్రీడలు, శ్మశానాల్లో రోడ్లు తదితరాలకు ఈ నిధులు వెచ్చించారు. 2021 సెప్టెంబర్ 25 మొదలు 2022 మార్చి 31 వరకు రూ.16.84 కోట్లు, 2022–23లో రూ.11.90 కోట్లు, 2023–24లో రూ.20.90 కోట్లు వెరసి రూ.49.64 కోట్లు కేటాయించారు. దర్శి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు ఏకంగా రూ.10 కోట్లు కేటాయించారు. వాటిని తాగునీటి పథకాలకు, సీసీ రోడ్లకు వెచ్చించారు.

> **మరో పక్షం రోజుల్లో జెడ్పీ కార్యాలయం మార్పు**
>
> 
>
> పరిపాలనా పరంగా ప్రస్తుతం ఉన్న జెడ్పీ కార్యాలయం చాలా ఇరుకుగా ఉంది. ఈ నేపథ్యంలో ఈ కార్యాలయం స్థానంలో నూతన కార్యాలయం నిర్మించాలని నిర్ణయించాం. ఈ మేరకు వివరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి కూడా పంపాం. ప్రస్తుతం ఫైల్ ఆర్థికశాఖ వద్ద ఉంది. నిధులు విడుదల కాగానే నూతన కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. అప్పటి వరకు జెడ్పీ కార్యాలయాన్ని మినీ స్టేడియం పక్కన ఉన్న డీపీఆర్‌సీ భవనంలోకి మార్చాలని నిర్ణయించాం. ఈ ప్రక్రియ మరో 10 నుంచి 15 రోజుల్లో పూర్తిచేస్తాం. జెడ్పీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు ఏమాత్రం భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో తనకు బాధ్యతల నిర్వహణలో సహకరిస్తున్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు, గౌరవ సభ్యులతోపాటు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నా. మునుముందు కూడా ఇంతకంటే మంచిగా జిల్లా అభివృద్ధికి సహకరించాలని వారిని కోరుకుంటున్నా.
>
> – బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీచైర్‌పర్సన్

సంక్షేమ హాస్టళ్లలో పెరిగిన ఉత్తీర్ణత శాతం:

దర్శి నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులతోపాటు జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లలో ఉండి పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థులకు జెడ్పీ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి స్టడీ మెటీరియల్ అందించారు. దీని సాయంతో ఈ ఏడాది సంక్షేమ హాస్టళ్ల పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరిగింది. దీంతో ఈ పథకాన్ని ఈ ఏడాది కూడా నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించారు. మరో వైపు బాలికల సంక్షేమ హాస్టళ్లను పరిశీలించినపుడు విద్యుత్ అంతరాయం కలిగితే బాలికలు పడుతున్న అవస్థలను ఆమె గమనించారు. దీంతో మానవీయ కోణంలో ఆలోచించి జెడ్పీ సొంత భవనాలు ఉన్న బాలికల సంక్షేమ వసతి గృహాలకు ప్రస్తుతం ఇన్వర్టర్లను ఏర్పాటుచేసి చిన్నారుల సంతోషానికి కారణమయ్యారు.

52 మందికి పదోన్నతులు.. మరో 72 మందికి కారుణ్య నియామకాలు:

ఈ రెండేళ్ల పదవీ కాలంలో 15 మంది రికార్డు అసిస్టెంట్లుగా, 9 మంది జూనియర్ అసిస్టెంట్లు, 17 మంది సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది సూపరింటెండెంట్లుగా వెరసి 52 మంది పదోన్నతులు అందుకున్నారు. పలువురు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలకు తక్షణమే కారుణ్య నియామకాలు అందించి ఉపాధి కల్పించారు. 27 మంది జూనియర్ అసిస్టెంట్లు, 15 మంది టైపిస్టులు, 30 మంది ఆఫీస్ సబార్డినేట్లుగా వెరసి 72 మంది ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధుడు మృతి

మద్దిపాడు: ఆటో ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. వెల్లంపల్లి గ్రామానికి చెందిన షేక్ అహమ్మద్ సాహెబ్(73) కొలచనకోట సమీపంలోని పెట్రోలు బంక్ దగ్గర ఉన్న మామిడితోటకు కాపలాగా వెళ్లడానికి శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో బయలుదేరారు. ఈ క్రమంలో ఆయన రోడ్డు పైకి రాగానే వెల్లంపల్లి నుంచి మల్లవరం గ్రామానికి వెళ్తున్న ఆటో డ్రైవర్ బత్తుల సందీప్ ఢీకొట్టాడు. అహ్మద్ సాహెబ్ చెవుల వెంట రక్తం కారడంతోపాటు మోకాళ్ల వద్ద తీవ్రమైన గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని మద్దిపాడు ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాయీబ్రహ్మణ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



మాట్లాడుతున్న నాయీ బ్రహ్మణ సంఘ నాయకులు

ఒంగోలు సెంట్రల్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివితే విజయం సొంతమవుతుందని నాయీబ్రహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో ఆదివారం నాయీ బ్రహ్మణ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. దివంగత కొల్లూరి దుర్గాప్రసాద్ చూపిన బాటలో నడుస్తూ నాలుగేళ్లుగా విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వక్తలు తెలిపారు. కార్యక్రమంలో నాయి బ్రహ్మణ ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య, మాజీ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు మధుబాబు, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ చెరుకూరి జయలక్ష్మి, కోఆర్డినేటర్ నాదేండ్ల రాఘవరావు, కోశాధికారి పి.మధుబాబు, వల్లూరి కోటేశ్వరరావు, పుల్లట్ల సుధాకర్, చిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



మృతి చెందిన జమాల్

కొమరోలు : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన కొమరోలు మండలంలోని గుండ్రెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. గుండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన జమాల్(30) తన ఇంట్లో పని చేసుకుంటున్న సమయంలో నీటి మడుగుపై కాలు వేశాడు. విద్యుత్ సరఫరా అవుతున్న తీగ నీటి మడుగులో ఉండటంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒడిశా కార్మికుడు అనుమానాస్పద మృతి

మార్టూరు: ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి మార్టూరులో ఉరివేసుకొని మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన రామచంద్ర మహపాత్రో (34) గత కొన్నేళ్లుగాగా స్థానిక అమరావతి నూలుమిల్లులో కార్మికుడుగా పనిచేస్తున్నాడు. గత రెండు రోజులుగా మిల్లులో పనికి రాలేదు. క్వార్టర్స్‌లో కూడా కనిపించకపోవడంతో రామచంద్ర మహపాత్రో తోటి కార్మికులు ఆదివారం నూలుమిల్లు పరిసరాలను గాలించారు. అందులో భాగంగా మిల్లు వెనుక వైపు గల చెట్టుకు ఉరేసుకొని వేలాడుతూ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. రామచంద్ర మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన ఎస్సై కే కమలాకర్, సీఐ ఫిరోజ్ బృందం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మేదరమెట్ల: ఆర్థిక ఇబ్బందులు ఒక పక్క, కుమారుడికి అనారోగ్యం మరో పక్కన.. ఈ రెండు కారణాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామం దాసరిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దాసరిపాలేనికి చెందిన పూరిమిట్ల విజయ్(30) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇతనికి భార్య, కుమార్తె, ఆరు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. అయితే కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. దీంతో తండ్రి విజయ్ హైదరాబాద్‌లో కుమారుడికి వైద్యం చేయించుకుంటూ అక్కడే కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కుమారుడి వైద్యం కోసం ఎంత డబ్బు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన విజయ్ ఇటీవలే స్వగ్రామానికి వచ్చాడు. విజయ్ నివాసం ఉంటున్న ఇంటికి కొద్ది దూరంలో ఉన్న మరో ఇంట్లో శనివారం రాత్రి ఫ్యాన్ హుక్కుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి తలుపులు తీసి ఉండటాన్ని గమనించి చూడగా విజయ్ ఉరివేసుకొని కనిపించాడు. సంఘటనా స్థలాన్ని మేదరమెట్ల ఎస్సై నాగశివారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోటెత్తిన భక్త జనసంద్రం

- కొత్తపట్నం, పాకల తీరంలో కోలాహలంగా గణేశ్ నిమజ్జనాలు
- కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కలలో 323 విగ్రహాలు నిమజ్జనం
- పాకల బీచ్‌లో 176 గణపతి ప్రతిమలు గంగ చెంతకు..
- కొత్తపట్నంలో 132 మంది పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత
- సుమారు 50 వేల మంది భక్తులు హాజరైనట్లు అంచనా



వినాయకుడి విగ్రహాలు నిమజ్జనానికి వచ్చిన జనంతో రద్దీగా ఉన్న కొత్తపట్నం సముద్రతీరం

కొత్తపట్నం:

గణపతి బప్పా మోరియా నినాదాలతో తీరం మార్మోగింది. వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా 7 రోజుల పాటు పూజలందుకున్న గణేషుడు ఆదివారం గంగ చెంతకు చేరాడు. ఆదివారం సెలవు దినం కావడంతో కొత్తపట్నం తీరం కిటకిటలాడింది. ఉదయం ఓ మోస్తారుగా ఉన్న భక్తులు సాయంత్రానికి భారీగా విగ్రహాలతో తరలి వచ్చారు. ఒంగోలు నగర నలుమూలల నుంచి వచ్చిన వినాయక విగ్రహాలు, విగ్రహాలు వెంబడి వచ్చిన భక్తులతో తీరం పోటెత్తింది. ఈతముక్కల, మడనూరు తీర ప్రాంతంలో సూరారెడ్డిపాలెం నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. కొత్తపట్నం బీచ్‌లో 223, ఈతముక్కలలో 32, మడనూరులో 68 విగ్రహాలను నిమజ్జనాలు చేశారు. ఆదివారం రాత్రి వరకు ఒంగోలు నుంచి కొత్తపట్నం వరకు వినాయక విగ్రహాలు బారులు తీరాయి. అటు సూరారెడ్డిపాలెం నుంచి ఈతముక్కల, మడనూరు బీచ్ వరకు బారులు తీరాయి. మత్స్యకారుల సహాయంతో వినాయక విగ్రహాలను ట్రాక్టర్ నుంచి కింది దింపి పూజల అనంతరం సముద్రంలో నిమజ్జం చేశారు.

ఉదయం మెల్లగా ప్రారంభమై.. సాయంత్రానికి ఒక్కసారిగా..

ఆదివారం మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ బీచ్‌లలో 80 విగ్రహాలు మాత్రమే నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 176 వినాయక విగ్రహాలు వచ్చాయి. అయితే సాయంత్రం 4 గంటల సమయానికి ఒక్కసారిగా విగ్రహాలు భారీగా తరలిరావడంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనాలను అదుపు చేయడం పోలీసుల వల్ల కాలేదు. బోట్లను సముద్రంలోకి లాగే ట్రాక్టర్లను తీసుకువచ్చి తీరంలో గస్తీ తిప్పారు. దీంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. చీకటి పడిన తరువాత కొన్ని విగ్రహాలు రావడంతో విగ్రహాలను మాత్రమే సముద్రంలోనికి తీసుమతిచ్చారు. భక్తులను మాత్రం సముద్రస్నానమాచరించకుండ సముద్రం నీరు తలపై చల్లుకునే అవకాశం కల్పించారు. కొత్తపట్నం పల్లె పాలెంలో ముందు రాములవారి ఆలయ ప్రాంగణంలో వినాయక విగ్రహం వెంబడి వచ్చిన ఆటోలు, లారీలు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు నిలుపుదల చేయించారు. అక్కడ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న బీచ్‌కు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. దీంతో కొంత మంది వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులకు గురయ్యారు. అలలు ఉధృతంగా ఉండంతో పోలీసులు అలలు మధ్యలో ఉండి ఎవ్వరినీ లోపలికి పోనివ్వకుండా అదుపు చేశారు. తీరం వెంబడి పోలీసులు ఎప్పటికప్పుడు మైక్ ద్వారా భక్తులకు సమాచారం తెలియజేశారు. ఎస్సై బి.సాంబశివరావు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా మొబైల్ వెహికల్‌తో గస్తీ తిరిగి పర్యవేక్షించారు. ముందుగా డీఎస్పీ బాలనారాయణరెడ్డి ఆదివారం ఉదయం తీరానికి చేరుకొని నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు.

132 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు

కొత్తపట్నం బీచ్‌లో ఎటువంటి సంఘటనలు జరగకుండా 132 మంది పోలీస్ సిబ్బందితో కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. ముందుగా అలలు మధ్య ఇసుక బస్తాలు వేసి హెచ్చరిక జెండాలు ఏర్పాటు చేశారు. హెచ్చరిక జెండాలు దగ్గర మెరైన్ పోలీసులు, మత్స్యకారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి ప్రాణహానీ జరగకుండా ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ భక్తులు లోనికి వెళ్లనివ్వకుండా చర్యలు తీసుకున్నారు. ఒంగోలు నుంచి కొత్తపట్నం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు అదుపు చేశారు. తీరం వెంబడి మైక్‌తో ఎప్పటికప్పుడు సమాచారాన్ని భక్తులకు తెలియజేశారు. అలలు మధ్య మెరైన్ పోలీసులు లైఫ్ జాకెట్స్ ధరించి కంట్రోలు చేశారు. రాములవారి ఆలయం దగ్గర ట్రాఫిక్ జాం స్తంభించగానే ఎస్సై బి.సాంశివరావు సందర్భించి నియంత్రించారు. ఒంగోలు రెండో పట్టణ సీఐ జగదీష్, మెరైన్ సీఐ కట్టా శ్రీనివాసరావు తీరంలో పర్యేక్షించారు. తీరం వెంబడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

టీ-10 క్రికెట్ టోర్నీ ప్రారంభం

- హాజరైన ఎమ్మెల్యే కేపీ, రాఘవరెడ్డి
- తలపడుతున్న 35 జట్లు



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ, రాఘవరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కాలేజీలో టీ-10 క్రికెట్ టోర్నమెంటును ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి ప్రారంభించారు. ఆదివారం ఎస్‌వీకేపీ కళాశాలలో క్రీడాకారులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. పోటీల్లో 35 జట్లు తలపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, బెస్ట్ బ్యాట్స్‌మన్‌కు రూ.5 వేలు, బెస్ట్ బౌలర్‌కు రూ.5 వేలు, బెస్ట్ ఫీల్డర్‌కు రూ.5 వేలు, మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌కు రూ.5 వేలు అందించనున్నారు. తొలి మ్యాచ్‌లో బిరుదులనరవ టీమ్‌పై వివేకానంద టీమ్ విన్నర్‌గా నిలిచింది. 42 పరుగులు చేయడంతోపాటు 2 వికెట్లు తీసిన శివారెడ్డిని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరించింది. టోర్నీ ప్రారంభ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ ఆలీ బేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, శ్రీశైలం ట్రస్టు బోర్డు సభ్యురాలు డాక్టర్ కనకదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, కరీంబాషా, ఉత్తమ్‌కుమార్, రోజ్‌లిడియా తదితరులు పాల్గొన్నారు.

రూ.9 లక్షల విలువైన గోవా మద్యం సీజ్



గోవా తయారీ మద్యం, నిందితులను మీడియాకు చూపుతున్న అధికారులు

- వివరాలు వెల్లడించిన సెబ్ డీఎస్పీ సుదీర్‌బాబు

సింగరాయకొండ: స్థానిక సెబ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామంలో శనివారం రాత్రి సుమారు 9 లక్షల రూపాయల విలువైన 1,087 బాటిళ్ల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, సెబ్ డీఎస్పీ ఎం.సుధీర్‌బాబు తెలిపారు. స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. సింగరాయకొండ, ఒంగోలు, చీమకుర్తి, పొదిలి, దర్శి ప్రాంతాల్లో గోవా మద్యం విక్రయాలపై ఎస్పీ మలికాగర్గ్, జిల్లా సెబ్ అధికారి జి.నాగేశ్వరరావు ఆదేశాల మేరకు సెబ్, జేడీ టీమ్, ఒంగోలు వీటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో కె.బిట్రగుంట కేంద్రంగా మాధవి అనే మహిళ అక్రమ మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. శనివారం గోవా నుంచి కారులో తెస్తున్న 12 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఆమె ఇంటిని, పరిసరాలను తనిఖీ చేయగా మరో 22 కేసుల మద్యం దొరికిందని చెప్పారు. ప్రధానంగా విలువైన బ్రాండ్ల మద్యం అక్రమంగా రాష్ట్రంలోకి తెస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మాధవితో పాటు ఆమెకు సహకరిస్తున్న ఉమామహేష్‌నాయుడు, రవితోపాటు తణుకుకు చెందిన పాపినాయుడు, బాలాజీని అరెస్టు చేసినట్లు తెలిపారు. మద్యం రవాణా చేస్తున్న కారు, స్కూటీ, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మాధవిపై స్థానిక స్టేషన్‌లో, ఉమామహేష్ నాయుడుపై నిడదవోలు స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంలో గోవాకు చెందిన ఆనంద్‌వైన్స్ యజమాని తణుకులోని పాపినాయుడుకు నేరుగా గోవా తయారీ మద్యం సరఫరా చేస్తున్నాడని నిర్ధారణ అయిందన్నారు. వీరిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. దాడిలో ఒంగోలు సెబ్ సీఐ బి.లత, జేడీ టీమ్ సీఐ వంశీధర్, సెబ్ ఎస్సైలు దయాకర్, గోపాలకృష్ణ, ఒంగోలు డీటీఎఫ్ ఎస్సై ఎస్.శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లవరం వెంకన్నను దర్శించుకున్న జిల్లా జడ్జి భారతి



ఆలయ ప్రాంగణంలో మొక్క నాటుతున్న జిల్లా జడ్జి భారతి

మద్దిపాడు: మల్లవరం వెంకటేశ్వరస్వామిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. జిల్లా జడ్జికి అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, రాజశేఖరాచార్యులు ఆలయ మర్యాదలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. స్వామివారికి విశేష పూజల అనంతరం అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించి, శేష వస్త్రాన్ని బహూకరించారు. స్వామివారి వనంలో కొద్దిసేపు కలియతిరిగిన జిల్లా జడ్జి అక్కడ మొక్క నాటారు. ప్రధాన న్యాయమూర్తి వెంట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సబ్ జడ్జి శ్యాంబాబు, శ్రీవారి వనం సభ్యులు ఉన్నారు.

సాగర్ కాలువలోకి దూసుకెళ్లిన బైక్

- ఇద్దరికి తీవ్రగాయాలు



క్షతగాత్రుడు జక్రయ్యను మోసుకొస్తున్న రైతులు

బల్లికురవ: బైకు అదుపుతప్పి ఏబీసీ కాలువలో పడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం బల్లికురవ-అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్‌లోని ఏబీసీ కాలువ వల్లాపల్లి లాకుల వద్ద జరిగింది. అందిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన చాట్ల బాలకోటయ్య, చాట్ల జక్రయ్య బైకుపై బల్లికురవ వస్తున్నారు. ఏబీసీ కాలువ వద్ద వంతెనకు వద్దకు రాగానే అదుపు తప్పి యాంగ్లర్లు లేనందున బ్రిడ్జిపై నుంచి సుమారు 15 అడుగుల లోతుతో ఉన్న కాలువలోకి బైకుతో సహా పడ్డారు. కాలువలో నీటి ప్రవాహం లేకపోవటం వల్ల ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. సమీపంలోని పొలాల్లోని రైతులు కాలువలో పడ్డారని గమనించి హుటాహుటిన 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. మార్టూరు నుంచి వచ్చిన 108 స్ట్రెక్చర్ సహాయంతో రైతులే కాలువలోకి దిగి క్షతగాత్రులను కాలవలోనుంచి ఒడ్డుకు మోసుకువచ్చి 108 వాహనంలోకి ఎక్కించారు. ఈఎంటీ నాగేశ్వరమ్మ, పైలట్ శాయి ప్రతాప్‌రెడ్డి, ఇరువురికి ప్రాథమిక చికిత్స చేశారు. బాలకోటయ్యకు తొంటి, జక్రయ్యకు చేతులు విరిగాయి. క్షతగాత్రులను నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏబీసీ కాలువ వద్ద బ్రిడ్జి జీర్ణావస్థకు చేరటం ఇరువైపుల యాంగ్లర్లు లేనందున తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు బ్రిడ్జి ఇరువైపుల యాంగ్లర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు చెక్ పెట్టాలని వేడుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి



మృతి చెందిన కొమ్ము అనిల్

నాగులుప్పలపాడు: చదలవాడ-మద్దిరాలపాడు మధ్య గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి ఎదురెదురుగా బైకులు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు యువకుల్లో ఒకరు చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు నాగులుప్పలపాడు ఎస్సై హరిబాబు తెలిపారు. ప్రమాదంలో ఇనమనమెళ్లూరు పరిధిలోని ఎంపీసీ కాలనీకి చెందిన కొమ్ము అనీల్(24), చదలవాడ శివారు గ్రామం కేశినేనివారి పాలేనికి చెందిన వలంటీర్ సుధీర్, ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన తేజ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ కొమ్ము అనిల్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. వలంటీర్ సుధీర్‌ను మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. ఇదే ప్రమాదంలో గాయపడిన తేజ ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇంటర్ ఫెయిలయ్యారా.. నో వర్రీ!

- రీ అడ్మిషన్ పొందేందుకు అవకాశం
- ఇంటర్ అభ్యసిస్తూనే స్కిల్ హబ్ ద్వారా ఉపాధి శిక్షణ

ఒంగోలు: ఇంటర్మీడియెట్ ఫెయిలయ్యారా..? అయినా ఆందోళన చెందాల్సిన పని లేదని ఇంటర్ బోర్డు ప్రాంతీయ మండలి పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) ఎ.సైమన్ విక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి తాజా ఆదేశాల ప్రకారం ఒకసారి ఫెయిలైన విద్యార్థులు మళ్లీ ఇంటర్‌లో రీ అడ్మిషన్ పొందేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అయితే ఈ విద్యార్థులు తప్పనిసరిగా ఏదో ఒక ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి మాత్రమే రీ అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకుగాను అక్టోబరు 3వతేదీ వరకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఏదైనా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రవేశం పొందడమే కాకుండా పరీక్ష ఫీజు చెల్లించిన అనంతరం తమ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో తరగతులకు హాజరయ్యేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇది కేవలం ఫెయిలైన విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న నిర్ణయమని చెప్పారు. వీరు 2024 మార్చిలో జరిగే రెగ్యులర్ ఇంటర్ పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ ద్వారా ఉపాధి అవకాశం ఉన్న కోర్సుల్లో శిక్షణ తీసుకుని, ఉపాధి పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఒక వైపు ఇంటర్ చదువుతూనే మరో వైపు ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాని విద్యార్థులకు సూచించారు. ఇంటర్ కోర్సు నిర్వహిస్తున్న అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న అధ్యాపకులు, సిబ్బంది ఇంటర్ ఫెయిలైన విద్యార్థులను గుర్తించి వారికి ఉన్న అవకాశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆర్ఐఓ సూచించారు.

అపూర్వం.. 40 ఏళ్ల అనుబంధం

- వేడుకగా ఎస్‌వీకేపీ డిగ్రీ కాలేజీ 1979-82 బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం



అప్పటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పొదిలి: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి డిగ్రీ కళాశాల 1979-82 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వేడుకగా సాగింది. 40 వసంతాల తర్వాత ఒకే చోట కలుసుకున్న అప్పటి విద్యార్థులు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. వీరిలో కొందరు ఇప్పటికే ఉద్యోగ విరమణ చేయగా, మరి కొందరు ఉద్యోగ, వ్యాపార, ఇతర రంగాల్లో స్థిరపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు అందరూ ఒకే చోట చేరారు. కుటుంబ యోగక్షేమాలు విషయాలు తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పటి అధ్యాపకులైన పోలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథం, రమా చలపతి, శేషగిరి, ప్రస్తుత కళాశాల కరస్పాండెంట్ జీసీ సుబ్బారావును ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ తహసీల్దార్ చంద్రావతి, సుబ్బారావు, జగదీష్, సుధాకర్, ఉమామహేశ్వరి, ఎలిజబెత్ రాణి, మేరీకుమారి, రాజేశ్వరి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.